

ఖమ్మం బొక్కలగడ్డలో దుస్తులు శుభ్రం చేసి ఇంటి సామగ్రిని సర్దుతున్న మహిళ

# వెతలు తీరలే.. బురద వదలలే..

- మున్నేరు ప్రకోపానికి ఐదు రోజులు అయినా సర్కారు సాయం సున్నా..
- ఇస్తానన్న రూ.పది వేల ఊసులేదు. సర్వేలతో కాలయాపన..
- ఇక నీటి సరఫరా నిల్.. విద్యుత్ పునరుద్ధరణ లేదు..
- ఇంకా చీకట్లోనే మగ్గుతున్న 'మున్నేరు' బాధితులు
- పాములు, తేళ్లు, కొండచిలువల భయంతో జీవనం
- అక్కడక్కడా నామమాత్రంగా నిత్యావసర సరుకులు



ఖమ్మంలో బురదమయంగా మారిన రోడ్డు



ఖమ్మంలో తడిచిన బ్యాగును తెరిచి చూస్తున్న గృహ యజమాని

ఖమ్మం, సెప్టెంబర్ 5: మున్నేరు ప్రకోపానికి ఐదు రోజులు గడిచిపోయాయి. కానీ దాని ముంపు ప్రాంత ప్రజల వెతలు తీరలేదు. వారి కాలనీల్లోని బురద తొలగలేదు. ఇక సర్కారు సాయం సున్నాగానే మిగిలిపోయింది. సీఎం వచ్చి చూశారు. రూ.10 వేల సాయం ఇస్తానన్నారు. కానీ ఇంత వరకూ దాని ఊసే లేదు. ఇంకా సర్వేలతోనే కాలయాపన చేస్తున్నారు. దీంతో సర్కారు నమ్మకం కోల్పోయిన నగర ప్రజలు.. తమ ఇళ్లను శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నయ్యారు. ఈ క్రమంలో ఒక్కో కాలనీలో ఒక్కో విధమైన దయనీయ దృశ్యాలు కన్పిస్తున్నాయి. ఇక నీటి సరఫరా, విద్యుత్ పునరుద్ధరణ వంటివి లేవు. చాలా ప్రాంతాలు ఇంకా చీకట్లోనే మగ్గుతున్నాయి. పాములు, తేళ్లు, కొండచిలువల భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అక్కడక్కడా నామమాత్రంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు తప్ప.. ప్రభుత్వ పరంగా ఆదుకున్న ఆనవాళ్లు ఎక్కడా లేవు.

### ఒక్కో కాలనీలో ఒక్కో గాథ..

ప్రకాశ్‌నగర్ ప్రజల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇది శివారు ప్రాంతం కావడంతో మంచినీటి ట్యాంకర్లు లోపలికి వెళ్లడం లేదు. దీంతో అక్కడి ప్రజలు గుక్కెడు తాగునీళ్లకూ అల్లాడుతున్నారు. ఇక ఇంట్లో వినియోగానికీ నీళ్లు లేకపోవడంతో బురదలోనే ఉంటున్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సాయం మినహా ప్రభుత్వం నుంచి అందిన సాయం పెద్దగా ఏమీ లేదు. పైగా గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలు ఇక్కడి ప్రజల్లో మరికొంత ఆందోళనను పెంచుతున్నాయి. ఒకవేళ మళ్లీ పెద్ద వర్షం వస్తే తమ బతుకులు ఎలాగంటూ భయాందోళన చెందుతున్నారు. పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో ముంపు ప్రాంతంలో ఉన్న పాఠశాలల విద్యార్థులందరూ వారి బంధువుల ఇళ్లకు వెళ్లారు. చాలామంది విద్యార్థుల పుస్తకాలన్నీ వరదకు కొట్టుకుపోవడం, తడిచి పనికిరాకుండా పోయాయి. దీంతో ఎప్పుడూ చిరునవ్వులు చిందే వారి మోములు ఇప్పుడు కళతప్పాయి.

### ఇస్తానన్న రూ.10 వేల జాడే లేదు..

మున్నేరు ముంపు బాధితుల కష్టాలు తెలుసుకుంటానంటూ నాలుగు రోజుల క్రితం వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మునిగిన ప్రతి ఇంటికీ రూ.10 వేల తక్షణ సాయం అందిస్తానని మాట ఇచ్చి వెళ్లారు. నాలుగు రోజులు గడిచినా ఆ రూ.10 వేల జాడలేదు. కట్టుబట్టలతో మిగిలిన తమకు ఆ సాయమన్నా అందుతుందేమోనని ఎంతోమంది ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. సర్వేలతో కాలయాపన చేస్తున్నారు తప్ప ఇంత వరకూ ఏ ఒక్కరికీ ఆ సాయాన్ని అందించలేదు. అయితే సర్వే సమయంలో బాధితులు మరికొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సర్వేకు వచ్చిన అధికారులు.. బాధితుల బ్యాంకు ఖాతాల నెంబర్లు అడుగుతుండడం, ఇటీవలి వరదల్లో ఆ బ్యాంకు పాస్‌పుస్తకాలన్నీ కొట్టుకుపోవడం, తమ ఖాతాల నెంబర్లు తెలియకపోవడం వంటి కారణాలతో ఈ ఇసుమంత సాయాన్నీ పొందలేకపోతున్నారు.

### వారం రోజులుగా వర్షపు నీటిలో..



పాపటపల్లిలో ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు

రఘునాథపాలెం, సెప్టెంబర్ 5: మండలంలోని పాపటపల్లి ప్రజలు కూడా వారం రోజులుగా వర్షపు నీటితోనే సావాసం చేస్తున్నారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాల వల్ల ఆ గ్రామంలోని లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వారం రోజులుగా అక్కడి ఇళ్ల మధ్యనే నీరు నిలిచి ఉంది. ఇళ్లను నీళ్లు చుట్టుముట్టడం, ఇళ్లలోకి వరద నీరు రావడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



వెంకటేశ్వరనగర్‌లో అన్నదానం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ బాధ్యులు



బురదను శుభ్రం చేశాక ఆరుబయట ఆరుతున్న వంట సామగ్రి



ఖమ్మం మోతీనగర్‌లో ఇంటింటి సర్వే చేస్తున్న పోలీసులు

# ఎంపీ 'బండి' భూరి విరాళం

- ఖమ్మం జిల్లా వరద బాధితుల సహాయం కోసం రూ.కోటి
- ఖమ్మంలో కలెక్టర్‌కు చెక్కు అందజేసిన బండి పార్థసారథిరెడ్డి
- వైద్య శిబిరాల నిర్వహణకు ముందుకొచ్చిన బీఆర్ఎస్ ఎంపీ
- కలెక్టర్‌కు వైద్యబృందాలు, మందులు, అంబులెన్సుల అప్పగింత



ఖమ్మం కలెక్టర్‌కు రూ.కోటి చెక్కు అందిస్తున్న ఎంపీ పార్థసారథిరెడ్డి

ఖమ్మం, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త బండి పార్థసారథిరెడ్డి.. వరద బాధితుల సహాయార్థం రూ.కోటి విరాళాన్ని అందజేశారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి గురువారం ఖమ్మం కలెక్టరేట్‌కు వెళ్లిన ఆయన.. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు రూ.కోటి చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ రూ.కోటిని ఖమ్మం జిల్లాలో వరద సహాయక చర్యలకు, వరద బాధితులకు ఉపశమనం కలిగించే పనులకు వినియోగించాలని కోరారు. వర్షం సృష్టించిన బీభత్సానికి ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో వేలాదిమంది నిరాశ్రయులు కావడం తనను ఎంతగానో కలిచివేసిందని అన్నారు. జిల్లాకు చెందిన వ్యక్తిగా, ఖమ్మంతో అనుబంధం ఉన్న విద్యార్థిగా ఈ ప్రాంత ప్రజలను ఆదుకోవడం తన తక్షణ కర్తవ్యంగా భావించినట్లు చెప్పారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన వరదల వల్ల అక్కడి ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని అన్నారు. అందుకని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కూడా కోటి రూపాయలను వరద సహాయక చర్యల కోసం విరాళంగా అందించినట్లు తెలిపారు. కష్టాల్లో ఉన్న తన జిల్లా ప్రజలను ఆదుకోవాలనే సంకల్పంతో రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు చెప్పారు. అలాగే, వరద ప్రభావిత ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ఆయా ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించేందుకు తమ సింధు ఆసుపత్రి నుంచి వైద్యబృందాలు, మందులు, రెండు అంబులెన్సులను ఖమ్మం కలెక్టర్‌కు అప్పగించినట్లు వివరించారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురైనప్పుడు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తమ హెటిరో సంస్థ.. సేవా కార్యక్రమాల్లో అగ్రగామిగా ఉంటుందని గుర్తుచేశారు. గత వరదల సమయంలోనూ తాను ఖమ్మం కలెక్టర్‌కు రూ.కోటి విరాళం అందజేసినట్లు జ్ఞప్తికి తెచ్చారు. అనంతరం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. పార్థసారథిరెడ్డి సేవాభావానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎంహెచ్‌వో సుబ్బారావు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్‌ను విడుదల చేయాలి

**ఖమ్మం త్రీటౌన్ ఠాణా ఎదుట స్థానికుల ధర్నా**

**బీఆర్ఎస్ నేతల జోక్యంతో విడుదల చేసిన పోలీసులు**



ఖమ్మంలో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ మాటేటి నాగేశ్వరరావును విడుదల చేయాలంటూ త్రీటౌన్ ఠాణా ఎదుట ధర్నా చేస్తున్న స్థానికులు

ఖమ్మం, సెప్టెంబర్ 5 : వరద సహాయం విషయంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ అరుణ భర్త, మాజీ కార్పొరేటర్ మాటేటి నాగేశ్వరరావు మున్సిపల్ సిబ్బందిని ప్రశ్నించడం.. ఇందులో కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకోవడంతో మాటామాటా పెరగడంతో నాగేశ్వరరావును ఖమ్మం త్రీటౌన్ పోలీసులు గురువారం స్టేషన్‌కు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న స్థానికులు నాగేశ్వరరావును విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఠాణా ఎదుట ధర్నాకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని 47వ డివిజన్ పరిధిలోని వరద బాధితులకు బొక్కలగడ్డ వద్ద మున్సిపల్ సిబ్బంది నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో అద్దెకు ఉన్న వారికి కూడా సాయం అందించాలని కోరగా.. కేవలం స్థానికులకు మాత్రమే అందజేయాలని ఉన్నతాధికారులను నుంచి ఆదేశాలు ఉన్నాయని చెప్పడంతో నాగేశ్వరరావు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సిబ్బందికి, నాగేశ్వరరావుకు మధ్య మాటామాటా పెరగడం, ఇందులోనే కాంగ్రెస్ నాయకులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు అక్కడికి వచ్చి నాగేశ్వరరావును జీపులో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన స్థానికులు వందలాదిగా మాటేటి కిరణ్ ఆధ్వర్యంలో వెళ్లి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. దీంతో పోలీసులు, ప్రజలకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ కార్పొరేటర్ తోట వీరభద్రం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐతో మాట్లాడడంతో నాగేశ్వరరావును విడిచిపెట్టారు. దీంతో స్థానికులు ఆందోళన విరమించారు.

## అధైర్యపడొద్దు.. అండగా ఉంటా..

**మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి**

**కందాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం**




అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కందాల ఉపేందర్‌రెడ్డి

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 5 : వరద ముంపు బాధితులు ఎవరూ అధైర్యపడొద్దని, అధికారం లేకపోయినా మీకు అండగా ఉంటూ.. నావంతు సాయం అందిస్తానని మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మున్నేటి ముంపు ప్రాంతాలైన జలగంనగర్, నాయుడుపేట, ఇందిరమ్మకాలనీ, దానవాయిగూడెం కాలనీలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్‌తో కలిసి గురువారం పర్యటించారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత వారి యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సాయంపై ఆరా తీశారు. అనంతరం ఆయా డివిజన్లలో కందాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాలను కందాల ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలేరు ప్రజలు ఎప్పటికి నా కుటుంబమేనని, వారు ఆపదలో ఉంటే ఎలా చూస్తూ ఊరుకుంటానని అన్నారు. రూ.10 వేల ప్రభుత్వ సాయం పట్ల ఏ ఒక్కరూ సంతృప్తిగా లేరన్నారు. కనీసం ఒక్కో కుటుంబానికి రూ.లక్ష సాయం చేయాలని కందాల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో కొట్లాడి వరద బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వీరభద్రం, మానుకొండ శ్రీను, కనకయ్య, మేకల ఉదయ్, బానోత్ కృష్ణ, గడ్డా వీరన్న పాల్గొన్నారు.

## ముంపు బాధితులను ఆదుకుంటాం..

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి**



రాజీవ్ గృహకల్పలో పర్యటిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 5 : మున్నేరు వరద ముంపు బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కరుణగిరి, జలగంనగర్, పెద్దతండా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. కలియతిరుగుతూ ఇళ్ల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పారిశుద్ధ్య చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫైరింజన్ల సహయంతో ఇళ్లలోని బురదను శుభ్రం చేయాలన్నారు. అధికారులు సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి నష్టాన్ని అంచనా వేయాలన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లు, పుస్తకాలు, వస్తు సామగ్రి దెబ్బతిన్న వారికి న్యాయం చేస్తామన్నారు. తడిసిన బియ్యం స్థానంలో సన్న బియ్యం అందజేస్తామని, విద్యుత్ స్తంభాలు, తీగల మరమ్మతు వెంటనే చేపట్టాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మోటర్ సైకిల్‌పై కాలనీల్లో తిరుగుతూ పర్యవేక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఎంపీడీవో ఎస్.కుమార్, మద్దులపల్లి ఏఎంసీ చైర్మన్ బి.హరినాథబాబు తదితరులు పాల్గొన్నారు.

# వాగులకు వరద పోటు

- ఎగువ వరదతో భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి
- చర్లలో తాలిపేరు ప్రాజెక్టుకు పోటెత్తిన వరద నీరు
- కిన్నెరసాని వాగులో గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు ముమ్మరం



కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు జిల్లాలోని పలు మండలాల్లో గురువారం కురిసిన వర్షానికి జలాశయాలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరికను దాటి.. గురువారం సాయంత్రానికి 45.1 అడుగులకు నీటిమట్టం చేరింది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు 21 గేట్లు ఎత్తడంతో 94 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నది. కిన్నెరసానిలోకి 20 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా.. అధికారులు నాలుగు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు.

### పొంగుతున్న వాగులు

జిల్లాలోని చండ్రుగొండ మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. అత్యధికంగా అశ్వాపురం మండలంలో 77 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఆళ్లపల్లి 64, గుండాల 63.6, భద్రాచలం 62, మణుగూరు 52, దుమ్ముగూడెం 46, ములకలపల్లి 40, కరకగూడెం 40, టేకులపల్లి మండలాల్లో 21 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుండాలలో ఏడు మెలికల వాగు ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

### తాలిపేరుకు పోటెత్తిన వరద

తాలిపేరు ప్రాజెక్టులో భారీగా వరద నీరు చేరింది. దీంతో 21 గేట్లు ఎత్తడంతో 94 వేల క్యూసెక్కుల నీరు గోదావరిలో కలిసింది. దీంతో గోదావరిలో నీటి ప్రవాహం మరింతగా పెరిగింది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా తాలిపేరులో భారీగా నీరు చేరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

### కిన్నెరసానిలో గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు

బుధవారం రాత్రి దంతెలబోర, కిన్నెరసాని వాగులు పొంగి ప్రవహించడంతో పశువుల కాపరులు ఏడుగురు వరదలో చిక్కుకున్న విషయం తెలిసిందే. రాత్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో వారిని బయటకు తీయగలిగారు. అయితే ప్రమాదవశాత్తు అందులో ఒక వ్యక్తి వాగులో గల్లంతయ్యాడు. రాత్రంతా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం ఉదయం స్థానికులు వెతకడానికి వెళ్లి వాగు మధ్యలో చిక్కుకున్నారు. దీంతో అధికారులు సిబ్బందిని అలర్ట్ చేసి డ్రోన్‌ల సహాయంతో వాగు మధ్యలో చిక్కుకున్న ఐదుగురికి ఆహార పొట్లాలతోపాటు లైఫ్ జాకెట్లను అందించారు. తర్వాత ఎన్‌డీఆర్ఎఫ్ బృందం అక్కడికి చేరుకుని చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చారు. రాత్రి గల్లంతైన వ్యక్తి ఆచూకీ ఇంకా లభ్యం కాకపోవడంతో ఇంటి వద్ద భార్యాపిల్లలు రోదిస్తున్నారు.



గుండాల మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఏడుమెలికల వాగు



గల్లంతైన పశువుల కాపరి కోసం గాలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు

## ఖమ్మానికి చేరిన సిద్దిపేట నిత్యావసరాలు

**ఎంపీ వద్దిరాజుకు అందజేసిన సిద్దిపేట బృందం**



సిద్దిపేట నుంచి మాజీ మంత్రి హరీశ్‌రావు పంపిన సరుకులను ఖమ్మంలో స్వీకరిస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఖమ్మం, సెప్టెంబర్ 5 : ఖమ్మం మున్నేరు, పాలేరు వరద బాధితుల సహాయార్థం సిద్దిపేట నుంచి మాజీ మంత్రి హరీశ్‌రావు పంపిన ఆరు లారీల నిత్యావసర సరుకులు గురువారం రాత్రి ఖమ్మానికి చేరాయి. వీటిని సిద్దిపేట నియోజకవర్గ హరీశ్‌రావు టీం సభ్యులు.. ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సమక్షంలో అందజేశారు. ఆరు లారీల్లో బియ్యం, నిత్యావసర సరుకులు, బ్లాంకెట్స్, బ్రెడ్ ప్యాకెట్లు, ఆలు, ఉల్లిగడ్డలు, ఇతర సామగ్రి పంపించారు. వాటిని ఎంపీ రవిచంద్రతో కలిసి బీఆర్ఎస్ నేతలు పగడాల నాగరాజు, కూరాకుల నాగభూషణం, ఆర్జేసీ కృష్ణ, బెల్లం, తెలంగాణ ఉద్యమకారులు రామ్మూర్తి, సుబ్బారావు తదితరులు పరిశీలించి డివిజన్, రూరల్ గ్రామాల వారీగా కేటాయించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్ ఫిర్యాదులపై వేర్వేరు కేసులు

ఖమ్మం, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మున్నేరు వరద బాధితులను పరామర్శించేందుకు ఈ నెల 3న ఖమ్మంలో మాజీ మంత్రుల పర్యటన సందర్భంగా జరిగిన ఘటనపై ఖమ్మం పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదుచేశారు.

బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా నేత సంతోశ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై నమోదైన కేసు వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ నేత సంతోశ్‌రెడ్డి ఖమ్మం మంచికంటినగర్‌లో వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి వెళ్తున్నాడు. ఆ సమయంలో అతడు ముందు నడుస్తుండగా కొందరు కాంగ్రెస్ వ్యక్తులు.. ఆకస్మికంగా ఆ పక్కనే మాజీ మంత్రి హరీశ్‌రావు కారుపై దాడి చేశారు. ఆ సమయంలో ఆ కారులో మాజీ మంత్రులు అజయ్‌కుమార్, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఉన్నారు. అలాగే మరో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కారుపైనా కాంగ్రెస్ వ్యక్తులు దాడి చేయడంతో దాని అద్దాలు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఆ కార్లపై దాడిని అడ్డుకున్న సంతోశ్‌రెడ్డిని కాంగ్రెస్ వ్యక్తులు కారు కిందకు పడేశారు. మారణాయుధాలతో అతడిపై దాడి చేశారు. ఈ దాడిలో అతడి కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. కాలు పూర్తిగా విరిగిపోయింది. దీంతో అతడు మరణించాడనే భావనతో కాంగ్రెస్ వ్యక్తులు వెళ్లిపోయారు. ఈ మేరకు సంతోశ్‌రెడ్డి ఫిర్యాదు ప్రకారం ఖమ్మం పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే, బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, అజయ్‌కుమార్, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పయనిస్తున్న వాహనంపై కాంగ్రెస్ నేతలు దాడి చేశారని, వారిపై హత్యాయత్నానికి పాల్పడ్డారని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అదే రోజు సీపీకి అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు కాలేదు.

### మరో కేసు నమోదు..

మరో కేసులో యాకూబ్‌బాబా ఫిర్యాదు మేరకు నమోదైన కేసు వివరాల ప్రకారం.. ఖమ్మం బొక్కలగడ్డ ప్రాంతానికి చెందిన షేక్ యాకూబ్‌బాబా ఈ నెల 3న మంచికంటినగర్‌లో మున్నేరు పరీవాహక ప్రాంతంలో వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. ఆ సమయంలో అక్కడికి మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావులతోపాటు మరికొందరు నాయకులు వచ్చారు. ఎమ్మెల్యే స్టిక్కర్ ఉన్న కారు ఓ వ్యక్తిపైకి దూసుకురావడంతో అతడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో ఘర్షణ జరుగుతుండగా యాకూబ్‌బాబా ఆపే ప్రయత్నం చేశాడు. దీంతో కొంతమంది బీఆర్ఎస్ కార్యకర్తలు అతడిపై కర్రలతో దాడి చేశారు.